క్లుప్తంగా

యాదవులంతా సమష్టిగా పనిచేయాలి

పూర్ణానందంపేట(విజయవాడపశ్చిమ):యాదవులంతా కలసి కట్టుగా పనిచేసి మరోసారి ముఖ్యమంత్రిగా వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని గెలిపించుకునేందుకు సిద్ధం కావాలని వైఎస్సార్ సీపీ పశ్చిమ నియోజకవర్గ బీసీ సెల్ ఇన్‌చార్జి, సిటీ కార్యదర్శి గొలగాని శ్రీనివాసరావు పిలుపునిచ్చారు. పాత ఆర్‌ఆర్‌పేటలోని తన కార్యాలయంలో శనివారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. పోటీ చేసే అభ్యర్థులందరినీ గెలిపించుకుంటామని తెలిపారు. పశ్చిమ నియోజవర్గం పాలఫ్యాక్టరీ వద్ద వి కన్వెన్షన్ హాల్లో ఆదివారం యాదవుల ఆత్మీయ కలయిక నిర్వహిస్తున్నామని తెలిపారు. పెద్ద సంఖ్యలో యాదవులంతా పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. యాదవుల హక్కుల సాధన సీఎం జగన్‌మోహన్‌రెడ్డితోనే సాధ్యమవుతుందన్నారు. దీనికి యాదవులందరూ కలసి కట్టుగా కృషిచేయాలని కోరారు. యాదవ కుటుంబ సభ్యులందరూ పెద్ద ఎత్తున పాల్గొని ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని తెలిపారు. 34వ డివిజన్ యాదవ సంఘం అధ్యక్షుడు మల్లాది శివ యాదవ్, నాయకులు ప్రసాద్ యాదవ్, కర్రి బంగారురాజు యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

భవానీపురం(విజయవాడపశ్చిమ):కబేళా విద్యుత్ ఉపకేంద్రంలో మరమ్మతుల కారణంగా కొన్ని ప్రాంతాలలో రెండు గంటలపాటు విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందని ఏపీసీపీడీసీఎల్ కార్యనిర్వాహక ఇంజనీర్ బీవీ సుధాకర్ ఒక ప్రకటనలో తెలియ చేశారు. ఆదివారం ఉదయం 8 గంటల నుంచి 10 గంటల వరకు ఇండస్ట్రియల్ ఏరియా, కబేళా సెంటర్, ఊర్మిళానగర్, జోజినగర్, పోలీస్ కాలనీ, టెలిఫోన్ కాలనీ, సితార సెంటర్, లేబర్ కాలనీ, మిథిలానగర్, ఆర్టీసీ వర్క్‌షాప్ రోడ్, చెరువు సెంటర్, మర్రిచెట్టు సెంటర్, పెద్ద సాయిబాబా గుడి ఏరియా, రైతుబజార్ రోడ్, లలితానగర్, మానవమందిరం రోడ్, టీవీ కృష్ణారావు వీధి తదితర ప్రాంతాల్లో కరెంట్ నిలిపి వేయనున్నట్లు పేర్కొన్నారు. వినియోగదారులు గమనించి సహకరించాలని కోరారు.

వైదిక కమిటీలో ఇద్దరికి స్థానం

ఇంద్రకీలాద్రి(విజయవాడపశ్చిమ):దుర్గా మల్లేశ్వర స్వామి వార్ల దేవస్థాన వైదిక కమిటీలో మరో ఇద్దరికి స్థానం కల్పిస్తూ ఈవో కెఎస్.రామారావు శనివారం ఆదేశాలు జారీ చేశారు. ఉప ప్రధాన అర్చకులు ఎస్‌వీడీఎం. ప్రసాద్, ముఖ్య అర్చక రంగావజ్జుల శ్రీనివాసశాస్త్రిలను వైదిక కమిటీలో స్థానం కల్పించారు. ప్రస్తుతం వైదిక కమిటీలో 8 మంది సభ్యులు బాధ్యతలు నిర్వహిస్తుండగా, అదనంగా మరో ఇద్దరికి స్థానం కల్పించడంతో కమిటీలో సభ్యుల సంఖ్య పదికి చేరింది.

విద్యార్థి దశలో హైస్కూల్ కీలకం

కార్పొరేటర్ గుడివాడ నరేంద్ర రాఘవ

భవానీపురం(విజయవాడపశ్చిమ):విద్యార్థి దశలో హైస్కూల్ చదువు ఎంతో కీలకమైనదని, ఆ సమయంలో ప్రతి విద్యార్థీ కేవలం చదువుపైనే దృష్టి పెట్టాలని 39వ డివిజన్ కార్పొరేటర్ గుడివాడ నరేంద్ర రాఘవ అన్నారు. విద్యాధరపురంలోని బెజవాడ రాజారావు హైస్కూల్‌లో శనివారం సాయంత్రం నిర్వహించిన పదవ తరగతి బ్యాచ్ కెరీర్ గైడెన్స్ అండ్ ఫేర్‌వెల్ డే వేడుకలు ఉత్సాహంగా జరిగాయి. ముఖ్యఅతిథిగా హాజరైన నరేంద్ర రాఘవ మాట్లాడుతూ ప్రతి వ్యక్తి జీవితంలో హైస్కూల్ విద్య మరుపురాని అనుభవంగా మిగులుతుందని పేర్కొన్నారు. రానున్న పది పరీక్షల్లో విద్యార్థులు కష్టపడి మంచి మార్కులు సాధించాలని ఆకాంక్షించారు. సైకాలజిస్ట్ డాక్టర్ గర్రె శంకరరావు మాట్లాడుతూ మొబైల్ ఫోన్, టీవీ, సినిమాలకు దూరంగా ఉంటూ చదువుపై ఏకాగ్రత సారించాలని సూచించారు. సమయం వృథా చేయకుండా మంచి ఫలితాల కోసం కృషి చేయాలన్నారు. ఈ సందర్భంగా విద్యార్థులు ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. కార్యక్రమంలో హైస్కూల్ కరస్పాండెంట్ బెజవాడ రాజారావు, సెక్రటరీ బి.శ్యామ్ ప్రకాష్, ప్రిన్సిపాల్ లక్ష్మీ ప్రసన్న, కమిటీ సభ్యులు తమ్మన రమేష్ బాబు, మున్నలూరి సుబ్బారాయుడు, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

బాలిక అదృశ్యంపై కేసు

భవానీపురం(విజయవాడపశ్చిమ): స్నానం చేసి వస్తానని బాత్ రూమ్‌కు వెళ్లిన తన కుమార్తె పది నిమిషాల తరువాత చూస్తే కనబడ లేదని తల్లి కొత్తపేట పోలీసులకు ఫిర్యాదు చేసింది. పోలీసులు తెలిపిన వివరాల మేరకు... తూర్పు గోదావరి జిల్లా కూనవరం మండలంలో నివసిస్తున్న యగ్గిన సువర్ణ జ్యోతి, సత్యనారాయణ దంపతులకు ఇద్దరు కుమార్తెలు, ఒక కుమారుడు ఉన్నారు. చిన్న కుమార్తె (14)తో కలిసి ఈ నెల 7వ తేదీన విజయవాడ వన్‌టౌన్ పాడివీధిలోగల బంధువుల ఇంటికి వచ్చారు. రెండు రోజులు బాగానే ఉన్న బాలిక శనివారం మధ్యాహ్నం సుమారు 3.30 గంటల సమయంలో స్నానం చేసి వస్తానని బాత్ రూమ్‌లోకి వెళ్లింది. పది నిమిషాల తరువాత తల్లి సువర్ణ జ్యోతి కుమార్తెను పిలిచినా పలకకపోవడంతో బాత్ రూమ్ తలుపు తీసి చూడగా బాలిక కనబడ లేదు. బంధువుల సహాయంతో చుట్టుపక్కల వెతికినా ఫలితం లేకపోవడంతో తల్లి కొత్తపేట పోలీసులకు ఫిర్యాదు చేసింది. మిస్సింగ్ కేసు నమోదు చేసిన పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.







వైభవంగా రథోత్సవం

మహాశివరాత్రిని పురస్కరించుకొని వన్‌టౌన్ కెనాల్ రోడ్డులో శనివారం ఆది దంపతుల రథోత్సవం అత్యంత వైభవంగా నిర్వహించారు. మల్లేశ్వరుడు తన ఉభయ దేవేరులతో కలిసి రథాన్ని అధిష్టించి భక్తులకు దర్శనమిచ్చారు. కోలాటాలు, పులివేషాలు, బేతాళ నృత్యాలు, తదితర జానపద కళారూపాల నడుమ స్వామిని ఊరేగించారు. పెద్ద సంఖ్యలో భక్తులు ఉత్సవంలో పాల్గొన్నారు.

సాక్షి ఫొటోగ్రాఫర్, విజయవాడ











ఎన్నికల్లో వార్ వన్‌సైడ్ కావాలి

వైఎస్సార్ సీపీ పశ్చిమ ఇన్‌చార్జి షేక్ ఆసిఫ్

భవానీపురం(విజయవాడపశ్చిమ):రానున్న సార్వత్రిక ఎన్నికల్లో వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అఖండ విజయం వైపుగా ఓటింగ్ వన్‌సైడ్ వార్ కావాలని, ఆ దిశగా మహిళలు కృషి చేయాలని వైఎస్సార్ సీపీ పశ్చిమ నియోజకవర్గ ఇన్‌చార్జి షేక్ ఆసిఫ్ పిలుపునిచ్చారు. విద్యాధరపురంలోని పశ్చిమ నియోజకవర్గ వైఎస్సార్ సీపీ కార్యాలయంలో శనివారం నియోజకవర్గ మహిళలతో ఆత్మీయ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆసిఫ్ మాట్లాడుతూ కుటుంబ వ్యవస్థలో ఇంటి ఇల్లాలిదే కీలక పాత్ర అని తెలిపారు. ఆమె నేతృత్వంలోనే కుటుంబం అభివృద్ధి చెందుతుందన్నది వాస్తవమన్నారు. అందుకే రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అన్ని సంక్షేమ పథకాలు మహిళల బ్యాంక్ ఖాతాల్లోనే డీబీటీ ద్వారా జమ చేస్తున్నారని చెప్పారు. ముఖ్యంగా పేద కుటుంబాల్లోని మహిళలు స్వశక్తిపై ఇంటిని చక్కదిద్దుకునే విధంగా అమ్మ ఒడి, చేయూత, ఆసరా, నవరత్నాలు - అందరికీ ఇళ్లు వంటి పథకాలన్నీ మహిళల పేరు మీదనే ఇస్తున్నారని చెప్పారు. సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి మహిళా పక్షపాతిగా నిలిచారని పేర్కొన్నారు. గతంలో ఏ ప్రభుత్వమూ చేయని విధంగా మహిళలకు ఇంతటి గౌరవాన్ని ఇస్తున్న సీఎం జగనన్న నాయకత్వంలోని వైఎస్సార్ సీపీ ప్రభుత్వం పక్షాన నిలబడే అభ్యర్థులకు వచ్చే సాధారణ ఎన్నికల్లో ఓట్లు వేసి అత్యధిక మెజారిటీతో గెలిపించుకోవాల్సిన ఆవశ్యకత ఎంతైనా ఉందన్నారు. ఇప్పుడు పేదలకు అందుతున్న ప్రభుత్వ సంక్షేమ పథకాలన్నీ కొనసాగాలంటే జగనన్నను మళ్లీ ముఖ్యమంత్రిని చేసుకోవాలని చెప్పారు.



మాట్లాడుతున్న ఆసిఫ్, చిత్రంలో రత్నకుమారి, దుర్గారావు

మహిళా సాధికారత జగనన్నతోనే సాధ్యం...

44వ డివిజన్ కార్పొరేటర్ మైలవరపు రత్నకుమారి మాట్లాడుతూ అన్ని రంగాల్లో మహిళలకు ప్రాధాన్యతనిస్తున్న సీఎం జగనన్నకు మహిళా లోకమంతా అండగా నిలబడాలని కోరారు. ప్రజాప్రతినిధులుగా, నామినేటెడ్ పదవుల్లో, నామినేటెడ్ వర్క్స్‌లో మహిళలకు 50 శాతం కేటాయించి వారి అభ్యున్నతికి కృషి చేస్తున్న జగనన్నను మళ్లీ ముఖ్యమంత్రిగా చేసుకుంటేనే మహిళా సాధికారత సాధ్యమవుతుందని పేర్కొన్నారు. చేయూత పథకం ద్వారా మహిళ జీవనోపాధి పొందుతూ కుటుంబాన్ని పోషించుకుంటున్నారంటే సీఎం జగనన్న చలువేనన్నారు. సమావేశంలో వైఎస్సార్ సీపీ రాష్ట్ర సంయుక్త కార్యదర్శి మైలవరపు దుర్గారావు, దుర్గ గుడి పాలకమండలి సభ్యురాలు అమలాపురం రామలక్ష్మి, వైఎస్ ఆర్ సీపీ నాయకులు విరజాల లీలామధు, పలువురు మహిళలు పాల్గొన్నారు.

మహిళల ఆర్థికాభివృద్ధికి చర్యలు

చిట్టినగర్(విజయవాడపశ్చిమ): మహిళలు ఆర్థికంగా నిలదొక్కుకునేలా సీఎం వైఎస్. జగన్‌మోహన్ రెడ్డి చర్యలు తీసుకున్నారని స్టేట్ మైనార్టీస్ ఫైనాన్స్ కార్పొరేషన్ చైర్మన్, పశ్చిమ వైఎస్సార్ సీపీ ఇన్‌చార్జి షేక్. ఆసిఫ్ తెలిపారు. నియోజక వర్గంలోని 48వ డివిజన్‌లో శనివారం మహిళలకు ఇళ్ల పట్టాల పంపిణీ నిర్వహించారు. కార్పొరేటర్ అత్తులూరి ఆదిలక్ష్మి ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా షేక్. ఆసిఫ్, నగర మేయర్ రాయన భాగ్యలక్ష్మి విచ్చేసి మహిళలకు పట్టాలు పంపిణీ చేశారు. సుమారు 1200 మందికి ఇళ్ల పట్టాల రిజిస్ట్రేషన్ చేసి పత్రాలను అందించామని చెప్పారు. మహిళలకు మేలు జరిగేలా వైఎస్. జగన్ ప్రభుత్వం అనేక సంక్షేమ పథకాలు అందించిందని చెప్పారు. మహిళలు ఆర్థికంగా అభివృద్ధి చెందేందుకు చేయూత, ఆసరా, అమ్మ ఒడి, కాపునేస్తం వంటి పథకాలు అమలు చేస్తున్నారని పేర్కొన్నారు. మహిళల కోసం ఇన్ని సంక్షేమ పథకాలను అమలు చేస్తున్న ప్రభుత్వం దేశంలో ఎక్కడా లేదన్నారు. ఈ పథకాలన్నీ రానున్న కాలంలో అమలు కావాలంటే సీఎంగా వైఎస్. జగన్‌మోహన్‌రెడ్డిని గెలిపించుకోవాల్సిన అవసరం ఉందన్నారు. మహిళలు తమ ఓట్లను వైఎస్సార్ సీపీకే వేయాలని కోరారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ డివిజన్ ఇన్‌చార్జి పెదబాబు, అధ్యక్షుడు పిళ్లా సూరిబాబు, కొరగంజి భాను, వెంకటలక్ష్మి, వరలక్ష్మి, అమర్‌నాథ్, గురుమూర్తి, జగదీష్, చంటి తదితరులు పాల్గొన్నారు.



మహిళలకు ఇళ్ల రిజిస్ట్రేషన్ పత్రాలను అందిస్తున్న ఆసిఫ్, భాగ్యలక్ష్మి, కార్పొరేటర్ ఆదిలక్ష్మి

వివాహిత అదృశ్యంపై కేసు నమోదు

భవానీపురం(విజయవాడపశ్చిమ):వివాహిత అయిన తన కుమార్తె అదృశ్యమైన విషయమై తల్లి కొత్తపేట పోలీసులకు ఫిర్యాదు చేసింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం... ఎండీ ఆషా, సలీం దంపతులు కుటుంబ సభ్యులతో కలిసి వించిపేట అబోతులవారి వీధిలో నివసిస్తున్నారు. సలీం గాంధీనగర్ చెప్పుల షాపులో పని చేస్తుండగా ఆషా ఇళ్లల్లో పని చేస్తుంటుంది. వారికి ఇద్దరు కుమారులు, ఇద్దరు కుమార్తెలు కాగా పెద్ద కుమార్తె ఆషును రెండేళ్ల క్రితం గౌస్‌కు ఇచ్చి వివాహం చేశారు. ఈ క్రమంలో ఈ నెల 8వ తేదీ సాయంత్రం గౌస్ పని నుంచి ఇంటికిరాగా భార్య ఆషు ఫోన్ మాట్లాడుతుంది. బయట ఎందుకు ఇంట్లోకి వెళ్లి మాట్లాడుకో అని చెప్పినా ఆమె వినకుండా అలాగే మాట్లాడుతుంది. ఈ విషయాన్ని అతను అత్త ఆషాకు చెప్పి బయటకు వెళ్లిపోయాడు. తిరిగి రాత్రి 9 గంటలకు ఇంటికి చేరుకున్న గౌస్‌కు భార్య కనిపించలేదు. విషయాన్ని అత్త ఆషాకు చెప్పగా ఆమె చుట్టుపక్కల, బంధువులను విచారించగా కుమార్తె ఆషు ఆచూకీ తెలియలేదు. ఫోన్ రింగ్ అవుతుంది కానీ లిఫ్ట్ చేయకపోవడంతో పోలీసులకు ఫిర్యాదు చేసింది. ఇంటి పక్కన అద్దెకు ఉంటున్న షేక్ రహమతుల్లా తరచూ తన కుమార్తెతో మాట్లాడుతుండేవాడని, అతనిపై అనుమానం ఉన్నట్లు ఆషా తన ఫిర్యాదులో పేర్కొంది. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

సహకార విలువలతోనే సంఘాల మనుగడ

సీనియర్ సహకార వేత్త ఆంజనేయులు

కృష్ణలంక(విజయవాడతూర్పు):సహకార విలువలతోనే సంఘాల మనుగడ సాగిస్తాయని మాజీ ఎమ్మెల్యే, సీనియర్ సహకారవేత్త ఎం.ఆంజనేయులు అన్నారు. నిజాయతీ, నిబద్ధత, కోఆపరేటివ్ ప్రిన్సిపల్స్ మీద నమ్మకం విశాఖపట్నం కోపరేటివ్ బ్యాంకును ఈరోజు అగ్రస్థానంలో నిలవడానికి ప్రధాన కారణాలని తెలిపారు. నాఫ్కాబ్ డైరెక్టర్‌గా ఎన్నికైన విశాఖ కో ఆపరేటివ్ అర్బన్ బ్యాంక్ చైర్మన్ చలసాని రాఘవేంద్రరావును శనివారం విజయవాడ మాకినేని బసవ పున్నయ్య విజ్ఞాన కేంద్రంలో ఆ బ్యాంకు సిబ్బంది, పాలకవర్గం ఆధ్వర్యంలో సన్మానించారు. ఆ బ్యాంకు డైరెక్టర్ సత్యనారాయణ మూర్తి అధ్యక్షతన నిర్వహించిన కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా పాల్గొన్న ఆంజనేయులు మాట్లాడారు. విభిన్న రాజకీయ దృక్పథాలు కలిగిన పాలకవర్గంలోని సభ్యులు రాజకీయాలకు అతీతంగా సమష్టిగా ముందుకు వెళ్లడం బ్యాంకు ప్రారంభం నుంచి వస్తున్న ప్రత్యేక విధానమన్నారు. బ్యాంకు పురోభివృద్ధిలో ఇది కీలకమైన అంశం అని చెప్పారు. సన్మాన గ్రహీత చలసాని రాఘవేంద్రరావు మాట్లాడుతూ ఈ సంస్థ అభివృద్ధి వెనుక అనేకమంది సమష్టి కృషి ఉందన్నారు. కార్యక్రమంలో వైస్ చైర్మన్ ఎస్.కామరాజు, డైరెక్టర్లు ఎం.రాఘవరావు, కోటేశ్వరరావు, జి.జనార్దనరావు, పీవీ రామారావు సీహెచ్ కృష్ణమోహన్ పాల్గొన్నారు.



రాఘవేంద్రరావును సత్కరిస్తున్న విశాఖ కోపరేటివ్ బ్యాంక్ డైరెక్టర్లు, సిబ్బంది

నిత్యాన్నదానానికి రూ.50వేల విరాళం

వేదాద్రి(జగ్గయ్యపేట): గ్రామంలో వేంచేసియున్న యోగానంద లక్ష్మీ నరసింహస్వామి వారి ఆలయంలో అమలవుతున్న నిత్యాన్నదాన పథకానికి జగ్గయ్యపేటకు చెందిన తాడికొండ రామారావు దంపతులు రూ.50 వేలు విరాళంగా అందించినట్లు ఈవో హేమలతాదేవి శనివారం తెలిపారు. ఆలయ అధికారులు, దాతలకు స్వామివారి శేషవస్త్రం, ప్రసాదాలు అందజేసి సత్కరించారు.

మహిళలు అన్ని రంగాల్లో రాణించాలి



పెనమలూరు: మహిళలు అన్ని రంగాల్లో రాణించాలని నెహ్రూ యువ కేంద్రం జిల్లా అధికారి సుంకర రాము తెలిపారు. మినిస్ట్రీ ఆఫ్ యూత్ ఎఫైర్స్ అండ్ స్పోర్ట్స్ పిలుపు మేరకు నారీశక్తి - ఫిట్‌నెస్ రన్ కార్యక్రమం కానూరు వీఆర్ సిద్ధార్థ ఇంజినీరింగ్ కాలేజీలో ఎన్ఎస్ఎస్ యూనిట్, నెహ్రూ యువకేంద్రం ఆధ్వర్యంలో శనివారం నిర్వహించారు. కార్యక్రమంలో పాల్గొన్న రాము మాట్లాడుతూ.. మహిళలకు క్రీడల్లో రాణించి వారి శక్తి సామర్థ్యాలను నిరూపించాలన్నారు. మహిళలు అన్ని రంగాల్లో రాణించే విధంగా ప్రభుత్వం అనేక కార్యక్రమాలు చేపడుతుందని చెప్పారు. ఈ సందర్భంగా విద్యార్థినులకు పరుగు పందెం నిర్వహించారు. విద్యార్థినులు మేరీరాణి, ధనలక్ష్మి, భవ్యశ్రీ పోటీలో గెలుపొందారు. ఈ సందర్భంగా 60 మంది విద్యార్థినులకు టీ షర్టులు, క్యాప్‌లు, కాఫీ మగ్ అందజేశారు. కార్యక్రమంలో ఎన్ఎస్ఎస్ ప్రోగ్రామ్ ఆఫీసర్ డాక్టర్ కొల్లా నరేంద్ర, విద్యార్థినులు పాల్గొన్నారు.

అక్కచెల్లెమ్మలకు జగనన్న అండదండలు

వైఎస్సార్ సీపీ పశ్చిమ ఇన్‌చార్జి ఆసిఫ్

వన్‌టౌన్(విజయవాడపశ్చిమ):అక్కచెల్లెమ్మలకు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి తన సంపూర్ణ అండదండలు అందిస్తూ అభివృద్ధిబాటలో ముందుకు తీసుకెళ్తున్నారని ఏపీ స్టేట్ మైనార్టీస్ ఫైనాన్స్ కార్పొరేషన్ చైర్మన్, వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ పశ్చిమ నియోజకవర్గ సమన్వయకర్త షేక్ ఆసిఫ్ అన్నారు. 51వ డివిజన్ కార్పొరేటర్ మరుపిళ్ల రాజేష్ ఆధ్వర్యంలో జగనన్న ఇళ్ల పట్టాల రిజిస్ట్రేషన్ పత్రాల పంపిణీ కార్యక్రమం కొత్తపేటలోని కార్పొరేటర్ కార్యాలయం వద్ద శనివారం నిర్వహించారు. ముఖ్యఅతిథిగా హాజరైన షేక్ ఆసిఫ్ మేయర్ రాయన భాగ్యలక్ష్మితో కలిసి మహిళలకు రిజిస్ట్రేషన్ పత్రాలను అందజేశారు. ఈ సందర్భంగా ఆసిఫ్ మాట్లాడుతూ రాష్ట్రంలో 33 లక్షల అక్క చెల్లెమ్మలకు సొంతింటి కలను నిజం చేసిన ఘనత దేశంలో ఒక్క జగన్‌మోహన్‌రెడ్డికి మాత్రమే దక్కుతుందని చెప్పారు. ప్రధానంగా జగనన్న ఇళ్లతో పాటుగా అమ్మ ఒడి, చేయూత, విద్యాదీవెన పథకాలన్నింటినీ మహిళలకే అందజేయటం వారి పట్ల జగనన్నకు ఉన్న అభిమానాన్ని తెలియజేస్తుందని పేర్కొన్నారు. దేశంలో ఇంత పెద్ద స్థాయిలో సంక్షేమ కార్యక్రమాలను అమలు చేస్తున్న ముఖ్యమంత్రి మరొకరు లేరన్నారు. ఒక్క పశ్చిమ నియోజకవర్గంలో సుమారు 40 వేల మంది పేద కుటంబాలకు సొంతింటిని అందజేసిన గొప్ప మనస్సున్న ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి మాత్రమేనని వివరించారు. రానున్న ఎన్నికల్లో అందరూ అండగా ఉండాలని కోరారు. మేయర్ రాయన భాగ్యలక్ష్మి మాట్లాడుతూ దేశంలో మహిళా సంక్షేమానికి, అభివృద్ధికి చిత్తశుద్ధితో పని చేస్తున్న ఏకైక సీఎం జగనన్న మాత్రమేనన్నారు. ఆయనకు మహిళలందరూ అండగా ఉండాలని కోరారు. కార్యక్రమానికి స్థానిక కార్పొరేటర్ మరుపిళ్ల రాజేష్ అధ్యక్షత వహించారు. కార్పొరేటర్లు ఆర్షద్, పూర్ణచంద్రరావు, నాయకులు కొరగంజి భాను తదితరులు పాల్గొన్నారు.



ఇళ్ల పట్టాల రిజిస్ట్రేషన్ పత్రాలను అందిస్తున్న షేక్ ఆసిఫ్, మేయర్ భాగ్యలక్ష్మి



జగనన్నకు మద్దతుగా రానున్న ఎన్నికలకు తాము సిద్ధమంటున్న నాయకులు

టీడీపీ నుంచి వైఎస్సార్ సీపీలో చేరికలు

సాదరంగా ఆహ్వానించిన పశ్చిమ ఇన్‌చార్జ్ ఆసిఫ్

భవానీపురం(విజయవాడపశ్చిమ):స్థానిక 43వ డివిజన్ పరిధిలోని పలువురు టీడీపీ నాయకులు వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీలో చేరారు. విద్యాధరపురం బైపాస్ రోడ్‌లోని వైఎస్సార్ సీపీ పశ్చిమ నియోజకవర్గ ఇన్‌చార్జ్ షేక్ ఆసిఫ్ కార్యాలయంలో శనివారం కార్పొరేటర్ బాపతి కోటిరెడ్డి ఆధ్వర్యంలో పార్టీలో చేరిన షేక్ అబ్దుల్లా, అమ్ము ఫ్రెండ్స్ సర్కిల్ యువతకు పార్టీ కండువాలు కప్పి సాదరంగా ఆహ్వానించారు. ఈ సందర్భంగా షేక్ ఆసిఫ్ మాట్లాడుతూ రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అమలు చేస్తున్న వివిధ సంక్షేమాలకు ఆకర్షితులైన పలువురు యువకులు పార్టీలో చేరటం అభినందనీయమని చెప్పారు. భవిష్యత్ అంతా యువతరానిదేనని తెలిపారు. సీఎం జగనన్న నాయకత్వంలో ఇప్పటికే లక్షలాది మంది యువతకు అనేక ఉద్యోగ, ఉపాధి అవకాశాలు లభించాయన్నారు. ముఖ్యంగా స్కిల్ కమ్యూనికేషన్స్‌లో శిక్షణ ఇచ్చి మరీ ఉద్యోగాలను కల్పిస్తున్నారని చెప్పారు. కార్పొరేటర్ బాపతి కోటిరెడ్డి మాట్లాడుతూ 43వ డివిజన్‌కు చెందిన పలువురు యువకులు వైఎస్సార్ సీపీలో చేరటం ద్వారా డివిజన్‌లో పార్టీ మరింత బలోపేతం అవుతుందన్నారు. యువశక్తికి మించింది లేదని, సీఎం జగనన్న అది నిరూపించారని పేర్కొన్నారు. కార్యక్రమంలో ఎన్టీఆర్ జిల్లా వక్ఫ్‌బోర్డ్ అధ్యక్షుడు షేక్ గౌస్‌మొహిద్దీన్, కార్పొరేటర్ మండేపూడి చటర్జీ, ఏపీ విశ్వబ్రాహ్మణ కార్పొరేషన్ మాజీ చైర్మన్ తోలేటి శ్రీకాంత్, వైఎస్సార్ సీపీ నాయకులు మాగం ఆత్మారాము, కంపా గంగాధర్, కసిరెడ్డి రోశిరెడ్డి, సాంబిరెడ్డి, షేక్ బుడే, హుస్సేన్, యూత్ వింగ్ నాయకులు గంపా నవీన్ తదితరులు పాల్గొన్నారు.



పార్టీలో చేరిన యువకులతో ఆసిఫ్, కోటిరెడ్డి తదితరులు

126 మందికి ప్రతిభా పురస్కారాలు అందజేత

కృష్ణలంక(విజయవాడతూర్పు):బాలికా విద్యను పోత్సహించాలనే ఉద్దేశంతో ప్రభుత్వ పాఠశాలల్లో 10 తరగతి చదువుతున్న బాలికలకు స్కాలర్‌షిప్‌లు అందజేస్తున్నామని కోరమండల్ ఇంటర్నేషనల్ వైస్ ప్రెసిడెంట్ జీవీ సుబ్బారెడ్డి అన్నారు. గవర్నర్‌పేటలోని ఎం.బి.విజ్ఞాన కేంద్రంలో కోరమండల్ ఇంటర్నేషన్ లిమిటెడ్ ఆధ్వర్యంలో తొమ్మిదో తరగతిలో ప్రతిభ కనబరిచిన 126 మంచి విద్యార్థులకు రూ.5లక్షల 28 విలువైన బాలికా విద్యా స్కాలర్‌షిప్ పురస్కారాలు శనివారం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా సుబ్బారెడ్డి మాట్లాడుతూ కార్పొరేట్ సోషల్ రెస్పాన్సిబిలిటీ పథకం కింద బాలికా విద్య స్కాలర్‌షిప్‌లను సంస్థ చేపట్టిందన్నారు. విద్య, సమాజాభివృద్ధికి సంస్థ చేస్తున్న కృషిని వివరించారు. కార్యక్రమంలో రీజినల్ బిజినెస్ హెడ్ చక్రవర్తి, డీజీఎం సచ్చిదానందరెడ్డి, మేనేజర్లు మురళీ, శ్రీను, సుధాకర్ గాయత్రి తదితరులు పాల్గొన్నారు.



బాలికలకు స్కాలర్‌షిప్‌లు అందజేస్తున్న సంస్థ వైస్ ప్రెసిడెంట్ సుబ్బారెడ్డి

చంద్రబాబు బీసీ డిక్లరేషన్ ఒక బూటకం

లబ్బీపేట(విజయవాడతూర్పు): బీసీల పట్ల కపటప్రేమ చూపుతూ చంద్రబాబు ఇటీవల ప్రకటించిన బీసీ డిక్లరేషన్ ఒక బూటకమని వైఎస్సార్ సీపీ బీసీ విభాగం రాష్ట్ర కార్యదర్శి కంపెల్ల భాను లక్ష్మీనారాయణ అన్నారు. ఆయన శనివారం మీడియాతో మాట్లాడుతూ చంద్రబాబు ఏనాడైనా ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలు నెరవేర్చిన సందర్భం ఉందా అని ప్రశ్నించారు. అధికారం కోసం ఎన్ని హామీలు అయినా ఇస్తారని, ఆ తర్వాత వాటిని గాలికొదిలేస్తారన్నారు. రాష్ట్రంలో బీసీలకు న్యాయం జరిగింది వైఎస్సార్ సీపీలోనే అన్నారు. గత 2019 ఎన్నికలకు ముందు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి బీసీలకు ఇచ్చిన ప్రతిహామీని నెరవేర్చారన్నారు. కానీ చంద్రబాబుకు హామీలు నెరవేర్చిన సందర్భం ఆయన 40 ఏళ్ల రాజకీయ జీవితంలో ఎప్పుడైనా ఉందా అని నిలదీశారు. బీసీలను మరోసారి మోసగించేందుకు డిక్లరేషన్ అంటూ మాయమాటలు చెబుతున్నారని చెప్పారు. ఆయన మోసకారి హామీలను బీసీలు నమ్మరని పేర్కొన్నారు. చంద్రబాబు విషయంలో అప్రమత్తంగా ఉండాలన్నారు.

యనమలకుదురులో ముగిసిన ప్రభోత్సవం

పెనమలూరు: యనమలకుదురు గ్రామంలో మహాశివరాత్రి బ్రహ్మోత్సవాల సందర్భంగా జరిగిన ప్రభోత్సవం వైభవంగా ముగిసింది. కొండ చుట్టూ ప్రభల ప్రదక్షిణ ఆలస్యం కావటంతో శనివారం ఉదయం వరకు ప్రభలు ప్రదర్శించారు. గ్రామంలో మహాశివరాత్రి పర్వదినం సందర్భంగా ప్రభోత్సవం నిర్వహించటం కొన్నేళ్లుగా ఆనవాయితీగా వస్తోంది. అయితే ఈ సంవత్సరం ఎక్కువ ప్రభలు ఏర్పాటు చేయటంతో ప్రభోత్సవం చాలా ఆలస్యంగా జరిగింది. సహజంగా ప్రభోత్సవం రాత్రి ప్రారంభించి ఉదయం 7 గంటల కల్లా ముగిస్తారు. అయితే ఈ సారి ప్రభలు ఎక్కువగా ఉండటం, భక్తుల రద్దీ విపరీతంగా ఉండటంతో ప్రభోత్సవం ఆలస్యంగా జరిగింది. ఉదయం 11 గంటల వరకు ప్రభోత్సవం చేశారు. కొండ చుట్టూ ప్రభలు ప్రదక్షిణ తరువాతే గ్రామోత్సవం చేశారు. కాగా శుక్రవారం అర్ధరాత్రి జరిగిన ప్రభోత్సవంలో రెండు ప్రభలకు ప్రమాదం జరిగింది. అయితే భక్తులకు ఎటువంటి ఇబ్బంది కలుగలేదు. సకాలంలో క్రేన్‌లు తీసుకు వచ్చి ప్రభలను సరి చేశారు. పోలీసులు కూడా ఎటువంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా కట్టుదిట్టమైన చర్యలు తీసుకున్నారు.